సాక్షి
అనంతపురం
ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



పదిలంగా పాతాళగంగ

జిల్లావ్యాప్తంగా పాతాళగంగ పదిలంగానే ఉన్నట్లు తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

8లో



టమాట కిలో రూ.28

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.28 ప్రకారం పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
32.1°/21.6°

అనంతపురం జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉదయం వేళ చలి వాతావరణం కొనసాగుతోంది. పగలంతా ఆకాశం మేఘావృతమై పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

పలు మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలోని పలు మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు 12 మండలాల పరిధిలో 4 మి.మీ మేర సగటు వర్షపాతం నమోదైంది. గుమ్మఘట్ట 40 మి.మీ, బ్రహ్మసముద్రం 20 మి.మీ, అనంతపురం 15 మి.మీ వర్షపాతం నమోదైంది. రాప్తాడు, రాయదుర్గం, నార్పల, కంబదూరు, బెళుగుప్ప, బుక్కరాయసముద్రం, డి.హీరేహాళ్, ఆత్మకూరు తదితర మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. ఖరీఫ్‌లో సాగు చేసిన కంది, పత్తి, ఆముదంతో పాటు రబీ పంటలకు వర్షం మేలు చేస్తుందని అధికారులు తెలిపారు.

సంక్రాంతి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం



అనంతపురం కల్చరల్: ఆల్ ది బెస్టు అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా సంక్రాంతి జాతీయ స్థాయి పురస్కారాల ప్రదానానికి రంగం సిద్ధమైంది. ఈ క్రమంలో అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు సంస్థ నిర్వాహకులు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టర్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వివిధ రంగాల్లో కృషి చేస్తున్న వారితో పాటు ప్రత్యేకంగా జర్నలిజం రంగంలో రాణిస్తున్న విలేకర్లు, ఫొటోగ్రాఫర్లకు సంక్రాంతి విశిష్ట ప్రతిభా అవార్డులు జనవరి 7న హైదరాబాదులో అందించనున్నారు. ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలతో ఈ నెల 25 లోపు 'ఆల్ ది బెస్టు అకాడమీ, డోర్.నం. 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాదు-15' చిరునామాకు దరఖాస్తులు పంపాలి.

అర్హత ఉంటే చెట్టాపట్టాలే

- అసైనీలకు యాజమాన్య హక్కుల కల్పనపై స్పష్టత
- ఏదో ఒక రెవెన్యూ రికార్డులో పేరుంటే చాలు
- 20 ఏళ్ల క్రితం పట్టాదారు పాసు పుస్తకమున్నా అర్హులే
- పొరంబోకు భూమి సాగు చేస్తున్నా పట్టా

జిల్లాలో అసైనీలు, భూముల వివరాలు

రెవెన్యూ డివిజన్	అసైనీలు/వారసులు	భూమి(ఎకరాల్లో)
అనంతపురం	21,525	49,231.14
గుంతకల్లు	16,444	37,558.45
కళ్యాణదుర్గం	34,302	1,22,463.83
మొత్తం	72,271	2,09,253.42



సాగు భూమి

అనంతపురం అర్బన్: అర్హులైన రైతులకు యాజమాన్య హక్కులు కల్పించే విషయంలో జగన్ సర్కార్ ఉదారంగా వ్యవహరిస్తోంది. చట్టం ప్రకారం అసైన్‌మెంట్ జరిగి 20 ఏళ్లు పూర్తయిన భూములన్నింటిపైనా ఆంక్షలు తొలగించి యాజమాన్య హక్కులు కల్పించాలని ఆదేశించింది. అసైన్‌మెంట్ చేసినట్లు ఏదో ఒక రెవెన్యూ రికార్డులో పేరు ఉంటే చాలు. 20 ఏళ్ల క్రితం పట్టాదారు పాసుపుస్తకం పొంది ఉంటే దాని ఆధారంగా యాజమాన్య హక్కు కల్పించాలని ఆదేశించింది. జలవనరుల పొరంబోకు భూములపై యాజమాన్య హక్కులు ఇవ్వవచ్చని స్పష్టం చేసింది.

లబ్ధిదారులు పెరిగే అవకాశం

అధికార యంత్రాంగం ఇప్పటివరకూ గుర్తించిన ప్రకారం జిల్లాలో 72 వేల మంది అసైనీలు యాజమాన్య హక్కులు పొందేందుకు అర్హులని తేలింది. యాజమాన్య హక్కులు కల్పించే విషయంలో ప్రభుత్వం మరింత వెసులుబాటు కల్పించిన నేపథ్యంలో లబ్ధిదారుల సంఖ్య పెరగవచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ప్రభుత్వ ఉత్తర్వులు ఇలా..

- డీకేటీ రిజిస్టర్, డీకేటీ పట్టా ఆఫీసు కాపీ, అసైన్‌మెంట్ కమిటీ మినిట్స్ లేకపోయినా.. వెబ్‌ల్యాండ్, పీఓఎల్ఆర్ వంటి ఏదో ఒక రెవెన్యూ రికార్డులో రైతు పేరు ఉంటే చాలు. అదే విధంగా 22ఏ జాబితా లేక 20 ఏళ్ల క్రితం జారీ చేసిన పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగా యాజమాన్య హక్కులు ఇవ్వాలి. భూమి పట్టాదారు ఆధీనంలో ఉంటేనే హక్కులు ఇచ్చే అవకాశం.
- భూ బదలాయింపు (ల్యాండ్ కన్వర్షన్), అసైన్‌మెంట్ జరిగి 20 ఏళ్లు పూర్తయిన జలవనరుల పోరంబోకు భూములపై యాజమాన్య హక్కులు ఇవ్వాలి. ఈ తరహా భూముల రికార్డులు లభించక పోతే... లోతుగా పరిశీలన చేసి హక్కు కల్పించాలి.
- భూ బదలాయింపు జరగని సందర్భాల్లో సుప్రీం కోర్టు ఉత్తర్వులు, హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం మినహాయింపు పొందిన భూములకు హక్కులు కల్పించాలి.
- ఏడబ్ల్యూడీ (ఆల్టర్నేటివ్ వెట్టింగ్ అండ్ డ్రై) భూములుగా మార్చకుండా తోపు/మేత పోరంబోకు భూములను అసైన్ చేసి ఉంటే... కలెక్టర్లు వాటిని ఏడబ్ల్యూడీగా మార్చి యాజమాన్య హక్కు ఇవ్వవచ్చు.
- డీ పట్టా జారీ చేసినప్పటికీ రికార్డుల్లో ఆ సర్వే నంబర్‌తో సరిపోలకపోతే...వారి ఆధీనంలో ఉన్న భూమి సర్వే నంబర్ నమోదు చేయాలి. యాజమాన్య హక్కులిచ్చేందుకు వారికి భూమి అసైన్ చేసిన పాత తేదీని పరిగణలోకి తీసుకోవాలి.
- ఖాతా నంబరు 10 వేల లోపు ఉండి, మిగులు భూమిగా రికార్డయి అసైన్డ్ భూములుగా నమోదు కాని వాటిని అసైన్‌మెంట్ రీ-వెరిఫికేషన్‌కు పంపాలి. ఆ భూములకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు ఎలక్ట్రానిక్ రెవెన్యూ రికార్డుల్లో పట్టాదారు పేరు చేరుస్తారు.
- ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాని అసైన్డ్ భూములను అసైన్డ్ జాబితాలో చేర్చేందుకు దరఖాస్తుల కోసం ఏపీ సేవా పోర్టల్‌లో ఒక ఆప్షన్ ఏర్పాటు. అలాంటి కేసులను సుమోటోగా స్వీకరించేందుకు జాయింట్ కలెక్టర్ లాగిన్‌లో అవకాశం కల్పిస్తారు. నిబంధనల ప్రకారం ఆ భూములకు యాజమాన్య హక్కులు ఇస్తారు.
- అసైన్డ్ చేసిన రస్తా పోరంబోకు భూములకు భూ మార్పిడి (ల్యాండ్ కన్వర్షన్) చేసి హక్కులు ఇస్తారు.
- ఆర్ఎస్ఆర్‌లో అటవీ భూమిగా నమోదైన భూమి, అసైన్‌మెంట్ జరిగి ఆర్ఓఆర్ రికార్డుల్లో నమోదై ఉంటే... ఆ భూమిని అటవీ చట్టం సెక్షన్ 4(1) కింద నోటిఫికేషన్ జారీ చేయకపోతే దానిపై హక్కులు పొందవచ్చు.
- భూమి స్వభావంలో ప్రభుత్వ భూమి- కేటాయించనిదిగా నమోదై... వాస్తవానికి ఆ భూమి అసైన్‌మెంట్ జరిగి ఉన్న కేసులను జిల్లాస్థాయి పరిశీలనకు పంపిస్తారు. పరిశీలనలో అర్హమైనవిగా నిర్ధారితమైతే హక్కులు ఇస్తారు.
- అర్హత ఉన్న అసైన్డ్ భూములు పొరపాటున పట్టా భూమిగా నమోదై 22ఏ జాబితాలో ఉంటే.. వాటిని జాబితా నుంచి కలెక్టర్ తొలగిస్తారు.
- రికార్డులు అందుబాటులో లేని, నీటి వనరులుగా గుర్తించిన కారణంగా యాజమాన్య హక్కులు ఇచ్చే విషయంలో నిర్ణయం తీసుకోలేని అసైన్డ్ భూములన్నింటినీ మరోసారి ధ్రువీకరణ కోసం వీఆర్ఓ లాగిన్‌కు పంపిస్తారు. ధ్రువీకరణలో అర్హత పొందితే హక్కులు కల్పిస్తారు.
- 20 ఏళ్ల క్రితం జారీ అయిన తాత్కాలిక పట్టాలైనా, డీకేటీ పట్టాలు జారీ అయ్యాయా లేదా అనే దాంతో సంబంధం లేకుండా యాజమాన్య హక్కు ఇస్తారు.

అర్హులందరికీ లబ్ధి



ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అర్హులైన రైతులందరికీ లబ్ధి చేకూరుస్తాం. 20 ఏళ్ల క్రితం అసైన్‌మెంట్ జరిగిన భూములపై యాజమాన్య హక్కులు కల్పించేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే జాబితా సిద్ధం చేశాం. ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం అర్హులై ఉండి మిగిలిన వారిని గుర్తించే ప్రక్రియ చేపడతాం. ల్యాండ్ పర్చేజ్ స్కీం కింద భూమి పొందిన ఎస్సీలకు యాజమాన్య హక్కులు కల్పిస్తాం.

– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

12న కరువు పరిశీలన బృందం రాక!

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో కరువు పరిస్థితుల పరిశీలనకు కేంద్ర బృందం పర్యటన ఖరారైనట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్, ఫార్మర్స్ వెల్ఫేర్ (డీఏఎఫ్‌డబ్ల్యూ) జాయింట్ సెక్రటరీ పంకజ్‌యాదవ్ నేతృత్వంలో 10 మంది అధికారులతో కూడిన బృందం ఈనెల 11న జిల్లాకు చేరుకునే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. 12న అనంతపురంలో సమావేశం ఏర్పాటు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో కరువు పరిస్థితులు తెలుసుకోనున్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ఆ తర్వాత సభ్యులు మూడు బృందాలుగా విడిపోతాయి. 13, 14న ఒక బృందం అన్నమయ్య, ఎన్టీఆర్ జిల్లాలకు, రెండో బృందం, శ్రీ సత్యసాయి, చిత్తూరు జిల్లాలు, మూడో బృందం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లా పరిధిలో 49 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లాలో 28, శ్రీసత్యసాయి జిల్లాలో 21 మండలాలు ఉన్నాయి. అధికారులు రూ.251.20 కోట్ల మేర పంటనష్టం జరిగినట్లు పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) పరిహారం కోసం ఇటీవల ప్రభుత్వానికి పంపారు.

8,072 కేసుల పరిష్కారం



గుంతకల్లు జేఎఫ్‌సీఎం కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 8,072 కేసులకు న్యాయమూర్తులు పరిష్కారం చూపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో మొత్తం 24 బెంచులు ఏర్పాటు చేశారు. ఫిర్యాదుదారులు సమ్మతించడంతో రాజీపడదగిన క్రిమినల్ కేసులు 909, సివిల్ కేసులు 993, ప్రీ లిటిగేషన్ కేసులు (పంచాయతీ ట్యాక్సు కేసులు, మున్సిపల్ ట్యాక్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు) 6,126, మోటారు ప్రమాద పరిహార కేసులు 44 పరిష్కారం చూపారు. రూ.3,25,07,000 మేర కక్షిదారులకు పరిహారం అందించాలని ఆదేశించారు. సివిల్ కేసుల్లో రూ.1,76,54,367కు పైగా, ప్రీ లిటిగేషన్ కేసుల్లో రూ.3,40,48,617 ను కక్షిదారుల మధ్య రాజీ ప్రకారం అందజేశారు. అదాలత్ నిర్వహణను జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జి. శ్రీనివాస్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, కార్యదర్శి దీన పర్యవేక్షించారు.

17న టీటీసీ థియరీ పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ థియరీ పరీక్షలు ఈనెల 17న ఉంటాయని జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం నగరంలో మొదటి రోడ్డులోని పొట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకూ, 3.30 నుంచి 4.30 గంటల వరకూ మూడు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

నైపుణ్యతతోనే వృత్తిలో రాణింపు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు



జస్టిస్ మన్మథరావుకు స్వాగతం పలుకుతున్న జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి

హిందూపురం: న్యాయవాద వృత్తిలో నైపుణ్యం ఉంటేనే ఉన్నతంగా రాణించగలరని హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి అనంతపురం జిల్లా పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ కె.మన్మథరావు అన్నారు. శనివారం ఆయన శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి విచ్చేశారు. కోర్టు ఆవరణాన్ని పరిశీలించి.. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. న్యాయవాదులు నిత్య విద్యార్థులుగా ఉంటూ అన్ని విషయాలపై అవగాహన పెంచుకుని రాణించాలన్నారు. న్యాయవాద వృత్తి ఎంతో కఠినమైందన్నారు. నైపుణ్యత, పట్టుదలతో ముందుకెళితేనే ఉన్నత స్థాయికి చేరుకోగలరన్నారు. న్యాయస్థానాలు ఎప్పుడూ కక్షిదారుల వైపే ఆలోచిస్తాయని, న్యాయవాదులు వేసే పిటిషన్లు సహేతుకంగా లేకపోతే పక్కకు తోసేస్తాయని అన్నారు. న్యాయస్థానాల్లో తీర్పులు సామాన్యులకు కూడా అర్థమయ్యేలా ఉండాలన్న ఉద్దేశంతో ఇటీవల రెండు తీర్పులను తెలుగులో వెల్లడించినట్లు తెలిపారు. అందరికీ అర్థమయ్యేలా అందుబాటులోకి తెచ్చిన ఆ తీర్పులను సైతం అధిక శాతం న్యాయవాదులు చదవకపోవడం బాధాకరమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరమైన మేరకు ఉపయోగించుకోవాలని సూచించారు. అంతకు ముందు లోక్ అదాలత్ సందర్భంగా కక్షిదారుల సదుపాయం కోసం కోర్టులో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని జస్టిస్ మన్మథరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, ఏజీపీలు అశ్వర్థరెడ్డి,శ్రీనివాసరెడ్డి, ఏపీపీలు ఇందాద్, నగేష్, సుహాసిని, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి హిదాయతుల్లా, సీనియర్ న్యాయవాదులు నాగభూషణరావు, రామచంద్రారెడ్డి, సిద్దూ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

గ్రూప్-1, 2 ఉద్యోగ పరీక్షలపై

ఉచిత అవగాహన సదస్సు

- డిసెంబర్ 23వ తేదీన అనంతపురంలో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలాలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్-1, 2 పరీక్షలపై అవగాహన కల్పించడం

అనంతపురం (ఎడ్యుకేషన్): రాష్ట్రంలో 81 గ్రూప్-1, 897 గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్-1, 2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో.. సాక్షి ఎడ్యుకేషన్.కామ్ (www. sakshieducation. com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షి ఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికీ తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలాలత

ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలాలత గ్రూప్1, గ్రూప్ 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరు కానున్నారు. ఆమె గ్రూప్-1, 2 పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8179100598 ఫోన్ నంబర్‌కు తమ పేరు, ఫోన్ నంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపగలరు.

ముఖ్య సమాచారం

అవగాహన సదస్సు తేదీ :
డిసెంబర్ 23, 2023 (శనివారం)

వేదిక:
ఆర్ట్స్ కాలేజ్ ఆడిటోరియం, అనంతపురం

సమయం:
ఉదయం 09:30 నుంచి 12:30 వరకు

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 8179100598

దొంగ ఓట్లు తొలగిస్తే టీడీపీ గల్లంతు

- కుప్పంలోనూ ఘోర పరాభవం ఖాయం
- టీడీపీ హయాంలో ఒక్కో వ్యక్తికి రెండు నుంచి మూడు చోట్ల ఓటుహక్కు
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాపు

రాయదుర్గం: ఓటరు జాబితా నుంచి దొంగ ఓట్లు తొలగిస్తే 2024 తర్వాత టీడీపీ అడ్రస్ గల్లంతవడం ఖాయమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దొంగ ఓట్లను తొలగిస్తే కుప్పం సహా 174 నియోజకవర్గాల్లోనూ పచ్చపార్టీకి ఘోర పరాభవం తప్పదన్నారు. 2017-19 మధ్య కాలంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసుల కనుసన్నల్లో రాయదుర్గం నియోజకవర్గంలో వేల సంఖ్యలో బోగస్ ఓటర్లను చేర్చారన్నారు. 2019లో ఒక్కో టీడీపీ సానుభూతిపరుడిని 2 నుంచి 3 చోట్ల ఓటరుగా చేర్చారని ఆరోపించారు. వీటిని ఆధారాలతో సహా ఈసీ దృష్టికి తీసుకెళ్లడంతో తొలగింపునకు మార్గం సుగమమైందన్నారు. అర్హత కలిగిన వారి ఓటు ఒక్కటి కూడా తొలగించాలని వైఎస్సార్‌సీపీ ఎన్నడూ కోరలేదని స్పష్టం చేశారు. ఒక వ్యక్తికి ఒక ఓటే ఉండాలనే ఈసీ నిర్ణయం సరైందేనని సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నికలు దగ్గరపడే కొద్ది రాయదుర్గం ప్రజలు కాలవకు గుర్తుకు వస్తున్నారని, ఈ అవకాశవాదికి 2024 ఎన్నికలే ఆఖరు కానున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీపై టీడీపీ, దానికి వంత పాడే ఎల్లో మీడియా చేసే దుష్ప్రచారాన్ని నమ్మరాదని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొని ఉపేంద్రారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ భోజరాజ్ నాయక్, గుమ్మఘట్ట జెడ్పీటీసీ పీఎస్ మహేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, పార్టీ జిల్లా కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ శివప్ప, మైనార్టీ నాయకుడు ముస్తాక్, హౌసింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైకోర్టు జడ్జిని కలిసిన ఎస్పీ



న్యాయమూర్తి మన్మథరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం టవర్‌క్లాక్: జిల్లా పర్యటనలో భాగంగా అనంతపురానికి శనివారం విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు జడ్జి డాక్టర్ జస్టిస్ మన్మథరావును ఎస్పీ అన్బురాజన్ మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేసి, ఘనంగా స్వాగతం పలికారు.

అయ్యప్ప భక్తుడి దుర్మరణం

గుమ్మఘట్ట: కర్ణాటకలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో గుమ్మఘట్ట మండలం కలుగోడుకు చెందిన అయ్యప్ప భక్తుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాలు... కలుగోడుకు చెందిన కె. వెంకటేశులు (53) ఇటీవల అయ్యప్ప దీక్ష చేపట్టాడు. ఈ క్రమంలో ఈ నెల 4న గోనబావిలోని అయ్యప్ప గుడి వద్ద ఇరుముడి కట్టుకుని మరో 20 మంది దీక్షాపరులతో కలసి కాలినడకన శబరిమలకు బయలుదేరి వెళ్లాడు. శనివారం కర్ణాటకలోని గౌరీబిదనూరు వద్ద రోడ్డు పక్కగా నడుచుకుంటూ వెళుతున్న అయ్యప్ప భక్తులను వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ఘటనలో వెంకటేశులు అక్కడికక్కడే మృతి చెందాడు. గోనబావికి చెందిన మణికంఠ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, మృతుడికి ఇద్దరు కుమార్తెలున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

హిందూపురం: జీవితంపై విరక్తితో ఓ గుర్తు తెలియని వ్యక్తి (50) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్డీఓ కార్యాలయం సమీపంలోని పట్టాలపై శనివారం ఉదయం మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం అందించడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. తెల్లటి ఫుల్ షర్టు, పంచ ధరించి ఉన్నాడు. వ్యక్తి అదృశ్యం కేసుల్లోని సంబంధీకులు ఎవరైనా 94412 38182లో సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు.

పదిలంగానే పాతాళగంగ

- గత నాలుగున్నరేళ్లలో తొలిసారిగా 10 మీటర్లు దాటిన సూచీ
- నాలుగేళ్లుగా 5 నుంచి 9 మీటర్ల మధ్య భూగర్భజలాలు
- 2014–18 మధ్య కాలంలో 20 నుంచి 25 మీటర్లుగా నమోదు



రాప్తాడు మండలంలో బోరుబావి నుంచి నీళ్లు

అనంతపురం అగ్రికల్చర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మొదటి సారిగా భూగర్భజలాలు స్వల్పంగా తగ్గుదల నమోదయ్యాయి. నైరుతి, ఈశాన్య రుతుపవనాలు ఆశించిన స్థాయిలో ప్రభావం చూపకపోవడం, ఇటీవల కొన్ని జిల్లాలను తీవ్రంగా వణికించిన 'మిచాంగ్' తుఫాను కూడా ప్రభావం చూపని కారణంగా భూగర్భజలమట్టం కాస్తంత తగ్గింది. అయినా పాతాళగంగ పదిలంగానే ఉన్నట్లు తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 97 ఫిజోమీటర్ల నుంచి భూగర్భజలశాఖ ఇటీవల సేకరించిన సమాచారం ప్రకారం ప్రస్తుతం జిల్లా సగటు నీటి మట్టం 10.14 మీటర్లుగా నమోదైంది. గత నాలుగున్నరేళ్లుగా కేవలం 5 మీటర్ల నుంచి 9 మీటర్ల మధ్య గణనీయంగా పెరిగిన భూగర్భజలాలు... తొలిసారిగా 10 మీటర్ల సూచీని తాకింది. 2014–18 మధ్య చంద్రబాబు హయాంలో భూగర్భజలాలు ఏకంగా 20 నుంచి 25 మీటర్ల మధ్య అత్యంత కనిష్ట స్థాయికి పడిపోయాయి. అప్పటితో పోల్చుకుంటే పరిస్థితి చాలా మెరుగ్గానే ఉండటం గమనార్హం.

10.14 మీటర్లుగా నమోదు

ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు 500 మి.మీ వర్షం పడాల్సిఉండగా 36 శాతం తక్కువగా 288 మి.మీ నమోదు కావడంతో భూగర్భజలమట్టం ప్రస్తుతం 10.14 మీటర్లుగా సగటు నమోదైంది. కొన్ని ప్రాంతాల్లో స్థిరంగానే ఉండగా కొన్ని మండలాల్లో తగ్గుముఖం పట్టాయి. బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, డి.హీరేహాళ్, గుత్తి, గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం, కంబదూరు, కణేకల్లు, పామిడి, పుట్లూరు, రాయదుర్గం, శెట్టూరు, తాడిపత్రి, యాడికి తదితర 15 మండలాల్లో కొంత వరకు తగ్గాయి.

- ఈ ఏడాది వర్షాల రూపంలో 103 టీఎంసీలు ప్రవహించగా అందులో 13 టీఎంసీల వరకు భూగర్భంలో ఇంకిపోయినట్లు భూగర్భజలశాఖ డీడీ కె.తిప్పేస్వామి తెలిపారు. ప్రస్తుతం ఒక మండలంలో మూడు మీటర్ల లోపు కనిపిస్తుండగా 3 నుంచి 8 మీటర్ల మధ్య 13 మండలాల్లో ఉన్నాయన్నారు. 8 నుంచి 15 మీటర్ల మధ్య 12 మండలాలు ఉండగా... కేవలం 5 మండలాల్లో 15 మీటర్లకు పైగా భూగర్భజలమట్టం నమోదైందని తెలిపారు.

'చెకుముకి' సంబరాలు వాయిదా

అనంతపురం కల్చరల్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 12న జరగాల్సిన మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు ఆ శాఖ కన్వీనర్ రిజ్వాన్, అధ్యక్షుడు రామిరెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మిచాంగ్ తుపాను కారణంగా కొన్ని జిల్లాల్లో సంబరాలు జరిగే అవకాశం లేనందున వాయిదా వేస్తూ మళ్లీ ఈ నెల 21న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంపై తెలంగాణ పోలీసుల దర్యాప్తు

పెద్దవడుగూరు : మండలంలోని మిడతూరు సమీపంలో గత నెల ధాబా వద్ద లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆచూకీని పసిగట్టేందుకు తెలంగాణ పోలీసులు వచ్చారు. శనివారం ఉదయం యాడికి సీఐ శంకరరెడ్డిని కలసిన తెలంగాణ పోలీసులు పెద్దవడుగూరు ఎస్‌ఐ శ్రీనివాసులుతో కలసి మృతదేహం లభ్యమైన చోటును పరిశీలించారు. కాగా, మృతుడు నాగర్‌కర్నూలుకు చెందిన వాడిగా అనుమానాలు వ్యక్తమవడంతో స్థానిక పోలీసులతో కలసి తెలంగాణ పోలీసులు ఉమ్మడి దర్యాప్తు చేపట్టినట్లుగా తెలుస్తోంది. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ.. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోందన్నారు.

ఇద్దరు పిల్లల సహా తల్లి అదృశ్యం

గుంతకల్లు రూరల్: మండలంలోని పాతకొత్తచెరువు గ్రామానికి చెందిన బోయ బాలకృష్ణ భార్య అశ్విని తన ఇద్దరు పిల్లలతో కలసి ఇల్లు విడిచి వెళ్లిపోయింది. ఈ నెల 8వ తేదీ నుంచి ఆమె కనిపించడం లేదంటూ కుటుంబసభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. తొమ్మిదేళ్ల క్రితం వివాహం చేసుకున్న బాలకృష్ణ, అశ్విని దంపతులకు ఎనిమిదేళ్ల వయసున్న కుమార్తె ధరణి, మూడేళ్ల వయసున్న కుమారుడు పునీత్ ఉన్నారు. వ్యవసాయంతో పాటు, గొర్రెల పోషణతో కుటుంబాన్ని బాలకృష్ణ పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం పిల్లలను పిలుచుకుని అశ్విని ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రమైన తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు రాత్రంతా గాలింపు చేపట్టారు. అయినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శనివారం ఉదయం గుంతకల్లు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 93949 17089, 94407 96824కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. కాగా, అశ్విని, ఆమె పిల్లలు ఉరవకొండ మండలం రాకెట్లలోని ఓ ఆలయంలో ఉన్నట్లుగా బంధువులు గుర్తించారు. శనివారం రాత్రి సమాచారం అందుకున్న వెంటనే విషయాన్ని పోలీసులకు కుటుంబసభ్యులు తెలిపారు.

చీనీలో మంగునల్లి నివారణ చర్యలు



మంగునల్లి ఆశించడంతో దెబ్బతిన్న చీనీకాయలు

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చీనీ తోటలను మంగునల్లి ఆశించి నష్ట తీవ్రత పెంచే ప్రమాదముందని శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ అధికారి జి.చంద్రశేఖర్ తెలిపారు. తుపాను వాతావరణం, జడివాన, గాలిలో తేమశాతం పెరగడం, ఉష్ణోగ్రతలు తగ్గడం లాంటి పరిస్థితుల్లో మంగునల్లి ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 50 వేల హెక్టార్ల భారీ విస్తీర్ణంలో చీనీ తోటలు సాగులో ఉన్నాయని, ఈ క్రమంలో రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంగునల్లి ఆశించిన చీనీకాయలకు మార్కెట్‌లో ధర తగ్గుతుందన్నారు. దీని వల్ల రైతు నష్టపోయే ప్రమాదముందని హెచ్చరించారు. మంగునల్లి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

- మంగునల్లి తొలిదశలో పాత ఆకులను ఆశిస్తాయి. తర్వాత వాటి ప్రభావం పండ్ల మీద ఉంటుంది. పండ్ల బయట ఉపరితలాన్ని 0.5 అంగులం, అంతకన్నా ఎక్కువ పరిమాణంలో తింటుంది. పండ్ల పైభాగంలో లాలాజలాన్ని వదలడం వల్ల పక్వానికి వచ్చిన పండ్లు ముదురు వక్క రంగులోకి, ఆకుపచ్చపండ్లు నలుపు రంగులోకి మారుతాయి. నల్లి ఎక్కువగా వసంతకాలం నుంచి వేసవి వరకూ ఆశిస్తుంది. తేమతో కూడిన ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. తెల్లని గోలీ ఆకార గుడ్లను ఆకులు లేదా పండ్ల ఉపరితలంపై పెడతాయి. ఇవి రెండు దశల అపరిపక్వ కీటకాలుగా మారి తర్వాత వయోజన కీటకాలుగా వృద్ధి చెందుతాయి. ఇవి గాలి ద్వారా చెట్టు నుంచి మరో చెట్టుకు వ్యాపించి నష్టం కలిగిస్తాయి. మంగునల్లి లక్షణాలు కనిపించిన ప్రాంతాల్లో మొదటి దశ కింద లీటర్ నీటికి 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ + 1.5 గ్రాములు సల్ఫర్ కలిపి పిచికారీ చేయాలన్నారు. మళ్లీ వారం రోజుల తర్వాత లీటర్ నీటికి రెండో దశగా 1 గ్రాము కార్బండిజమ్ + 2.5 గ్రాములు ఎం–45 కలిపి పిచికారీ చేయాలి. మూడో చర్య కింద మళ్లీ వారం రోజుల తర్వాత లీటర్ నీటికి 1 మి.లీ ఫొసజాక్విన్ లేదా 1 మి.లీ స్పైరోమెసిఫెన్ కలిపి పిచికారీ చేసుకుంటే మంగునల్లిని సమర్థవంతంగా అరికట్టవచ్చు.

సాగుదారులకు భూ పంపిణీ



పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

నార్పల: అర్హులైన సాగుదారులకు భూమిని ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. శింగనమల నియోజకవర్గ పరిధిలో దాదాపు 424 ఎకరాల భూమిని 302 మంది సాగుదారులకు హక్కుదారు పట్టాలను శనివారం పంపిణీ చేశారు. నార్పలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... 2003కు ముందు ఇచ్చిన 1,413 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి 708 మంది రైతులను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించి అమ్ముకునే హక్కు కల్పించినట్లు వివరించారు. పేదల పక్షపాతినని చెప్పుకునే చంద్రబాబు ఏనాడూ భూ పంపిణీపై దృష్టి సారించలేదన్నారు. గత పాలకుల నిర్వాకంతో పేదలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారన్నారు. జగనన్న నాలుగున్నరేళ్ల పాలనలో పార్టీలు, కులమతాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతోందన్నారు. రానున్నా రోజుల్లోనూ సంక్షేమం పథకాలు పారదర్శకంగా అమలు కావాలన్నా.. ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నా మరలా వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఫర్టిలైజర్ షాపును పరిశీలించి, యజమాని నాగభూషణాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, కో–ఆప్షన్ సభ్యురాలు షాబీరా, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ రఘునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గుంతకల్లు: స్థానిక హనుమన్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఆర్టీసీ డిపో వద్ద నిల్వ ఉంచిన 108 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ సుబ్బులక్ష్మి తెలిపారు. విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్, సిబ్బందికి అందిన సమాచారం మేరకు శనివారం ఉదయం ఆర్టీసీ డిపో సమీపంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో 208 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకోవడంతో పాటు ఐచర్ వాహనాన్ని సీజ్ చేశారు. బియ్యం తరలిస్తున్న వ్యాపారి రాము, ఐచర్ యజమాని చంద్ర, డ్రైవర్ మధు, క్లీనర్ ఉరుకుందుపై కేసు నమోదుకు పోలీసులకు సిఫారసు చేశారు.

జగన్ మరోసారి సీఎం కావడం ఖాయం

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కట్టెపోగు బసవరావు



పామిడి మండలంలో బసవరావు పాదయాత్రలో పాల్గొన్న ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి

పామిడి: రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయంసాధించి వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఏపీ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు, పాదయాత్ర బృందం అధినేత కట్టెపోగుల బసవరావు స్పష్టం చేశారు. ఆయన ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర శనివారం పామిడికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్ సాగిస్తున్న పాలన రామరాజ్యాన్ని తలపిస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే ప్రభుత్వాన్ని తెచ్చి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించిన ఘనత ఒక్క సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజలకు ఏ ఒక్కమేలు చేయని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, ఆయనకు వంతుపాడుతున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ 2024 ఎన్నికల తర్వాత కనుమరుగైపోతారన్నారు. అంతకు ముందు పామిడి మండలంలోకి ప్రవేశించిన బసవరావు ఆధ్వర్యంలోని పది మంది బృందానికి స్థానిక ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, రైతు విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శి బెల్లాల రమణారెడ్డి, చుక్కలూరు వెంకట్రామిరెడ్డి అలియాస్ దేవుడు, రామశేఖరరెడ్డి, తంబళ్లపల్లి వెంకట్రామిరెడ్డి తదితరులు అపూర్వ స్వాగతం పలికారు.

మహిళ బలవన్మరణం



సరోజమ్మ మృతదేహం

గుంతకల్లు రూరల్: అనారోగ్య కారణాలతో మనస్థాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.... గుంతకల్లు మండలం నక్కనదొడ్డి తండాకు చెందిన సోమ్లానాయక్, లక్ష్మమ్మ దంపతులకు కుమార్తె సరోజమ్మ (42), ఓ కుమారుడు ఉన్నారు. సరోజమ్మకు చిన్నప్పటి నుంచి కళ్లు కనిపించవు. కొన్నేళ్ల క్రితమే అనారోగ్యంతో సోమ్లానాయక్ మృతి చెందాడు. అప్పటి నుంచి లక్ష్మమ్మ ఒక్కతే కుటుంబాన్ని పోషిస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే సరోజమ్మకు అనారోగ్య సమస్యలు వెన్నాడుతూ వచ్చాయి. దీంతో మనస్తాపం చెందిన ఆమె శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై రూరల్ ఎస్‌ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తమ్ముడి హత్య కేసులో అన్న అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం: సెల్‌ఫోన్ కోసం అన్నదమ్ముల మధ్య చెలరేగిన ఘర్షణలో చివరకు తమ్ముడిని హతమార్చిన అన్నను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో సీఐ నాగరాజు, శెట్టూరు ఎస్‌ఐ రాంభూపాలతో కలసి డీఎస్పీ శ్రీనివాసులు శనివారం వెల్లడించారు. శెట్టూరు మండలం కనుకూరుకు చెందిన గొల్ల రవి, కృష్ణమూర్తి అన్నదమ్ములు. ఈ నెల 7న రవి కళ్యాణదుర్గం వస్తూ తన వెంట తమ్ముడి సెల్‌ఫోన్ పట్టుకొచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న కృష్ణమూర్తి వెంటనే కళ్యాణదుర్గంలోని వాల్మీకి సర్కిల్ వద్దకు చేరుకుని తన రవిని నిలదీశాడు. తనకు తెలియకుండా సెల్‌ఫోన్ ఎందుకు తెచ్చావంటూ రాయితో నుదిటిపై కొట్టాడు. అందరూ చూస్తుండగా తనకు జరిగిన అవమానాన్ని అన్న జీర్ణించుకోలేకపోయాడు. అదే రోజు రాత్రి భోజనం చేసి నిద్రిస్తున్న తమ్ముడిపై అర్ధరాత్రి దాటిన తర్వాత గొడ్డలితో దాడి చేసి, హతమార్చి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. హతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ నెల 8న సాయంత్రం 5.30 గంటలకు శెట్టూరు మండలం అయ్యగార్లపల్లి బస్టాఫ్ వద్ద రవిని గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

వైభవంగా అంజన్న పూల రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న విప్ కాపు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయ స్వామి పూల రథోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలోని మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, విశేష పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామివారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, వెండి తమలపాకుల అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. కర్ణాటక, ఆంధ్రా ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. సాయంత్రం మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 7.30 గంటలకు రథోత్సవాన్ని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజినేయులు, సర్పంచ్ పరమేశ్వర, వైస్ ఎంపీపీ రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖరరెడ్డి, లోకేష్, ఆనందరెడ్డి, మనోహర్‌శెట్టి, రామకృష్ణ, వీరన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వినోద్ (ఫైల్)

గుంతకల్లు రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన వినోద్ (28) గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం తన స్నేహితులు వినయ్, రవితో కలసి ద్విచక్ర వాహనంపై కసాపురానికి బయలుదేరిన వినోద్... గుంతకల్లు మండలం నక్కనదొడ్డి వద్దకు చేరుకోగానే వాహన వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన వినోద్ అక్కడికక్కడే మృతిచెందాడు. పరిస్థితి విషమంగా ఉన్న రవిని వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తీసుకెళ్లారు. స్వల్ప గాయాలతో వినయ్ బయటపడ్డాడు. ఘటనపై రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆకట్టుకున్న నృత్య నీరాజనం



నృత్యనీరాజనంలో పాల్గొన్న కళాకారులు

అనంతపురం కల్చరల్: రంగస్థల సకల వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి అనంతపురంలోని లలిత కళాపరిషత్తులో జరిగిన నృత్యనీరాజనం అందరినీ ఆకట్టుకుంది. 108 మంది కళాకారులు పార్వతీదేవి రూపాలతో రూపొందించిన నృత్యరూపకాన్ని మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్ గౌడ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు కోఆర్డినేటర్ డాక్టర్ శరత్‌చంద్ర ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నేటి తరానికి పురాణేతిహాసాల ఇతివృత్తాలపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో లలితకళాపరిషత్ పాలక మండలి సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటరుగా నమోదు చేసుకోండి

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 18 ఏళ్లు నిండి, ఇప్పటి వరకు ఓటు హక్కు వినియోగించుకోని యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఓ ప్రకటన విడుదల చేశాయి. ఆఫ్‌లైన్‌లో ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, బూత్ లెవెల్ ఆఫీసర్ వద్ద ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. www.ceo andhra.nic.inవెబ్ సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు.

క్రీడల్లోనూ రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోచ్ శ్రీకాంత్

అనంతపురం టవర్‌క్లాక్: విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని తైక్వాండో కోచ్‌లు శ్రీకాంత్, రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇటీవల ఉత్తరాఖండ్‌లో తైక్వాండో క్రీడలు నిర్వహించగా, రాష్ట్రం నుంచి లక్ష్మీసినర్జీ స్కూల్ విద్యార్థిని శ్రీభవిష్య గోల్డ్ మెడల్, యశస్విని సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. లక్ష్మీ సినర్జీ స్కూల్ యాజమాని మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ తమ స్కూల్ విద్యార్థిని శ్రీ భవిష్య గోల్డ్‌మెడల్, స్కూల్‌గేమ్స్‌లో రైల్వే కోడూరులో రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన గుజ్జల యోగ చర్విత‌ను అభినందించారు. తైక్వాండో శిక్షణకు, మెటీరియల్‌తోపాటు స్టేడియం ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోల్డ్ మెడల్ సాధించిన శ్రీభవిష్య తల్లిదండ్రులు ఉత్తం ప్రశాంత్‌కుమార్, సరిత ఉత్తం, సిల్వర్ మెడల్ సాధించిన యశస్విని తల్లి లక్ష్మీ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పండ్లతో అలంకరణ



పండ్ల అలంకరణలో హరిహరసుతుడు

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటిరోడ్డు కాశీ విశ్వేశ్వరాలయం ప్రాంగణంలోని హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయం శనివారం స్వామియే శరణం అయ్యప్ప అంటూ మార్మోగింది. స్వామికి పండ్లతో ప్రత్యేకంగా అలంకరించడం ఆకట్టుకుంది. కార్తీకమాసంలో వచ్చిన చివరి శనివారం స్వామిని వివిధ రకాల పూలు, పండ్లతో సర్వాంగసుందరంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేస్తారు. గురుస్వాములు లక్ష్మీరెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ ఈనెల 26 వరకు నిత్యాన్నదానం ఉంటుందన్నారు. ఈనెల 15 నుంచి 20 వరకు అయ్యప్ప స్వామి బ్రహ్మోత్సవాలు ఉంటాయన్నారు. 16న మహా కలశ పడిపూజలు., గ్రామోత్సవం ఉంటుందన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



రైల్వేఫీడర్ రోడ్డులోని అయ్యప్ప ఆలయంలో పుష్పయాగం చేస్తున్న మాలధారులు

అనంతపురం కల్చరల్: స్వామియే శరణమయ్యప్ప అంటూ హరిహరనాథుడి నామస్మరణతో ఆలయం మార్మోగింది. శనివారం సాయంత్రం నగర శివారులోని రామ్‌నగర్ 80 అడుగుల రోడ్డులో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయం అయ్యప్ప స్వామి కీర్తనలతో ఆలయం ప్రతిధ్వనించింది. మంటపంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న అయ్యప్ప స్వామి దీక్షాదారులు, శివ మాలదారుల మధ్య స్వామివారి ఉత్సవ మూర్తికి పెద్ద ఎత్తున పుష్పాభిషేకం నిర్వహించారు.

నేడు రాష్ట్రస్థాయి సదస్సు

అనంతపురం మెడికల్: ప్రస్తుత పరిస్థితుల్లో మానసిక సమస్యలు – వాటిని ఎలా అధిగమించాలనే అనేదానిపై నగరంలోని మాసినేని గ్రాండ్‌లో ఆదివారం సదస్సు జరగనున్నట్లు ప్రోగ్రాం ఆర్గనైజర్ డాక్టర్ వైద్యనాథ్ పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతుందన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

రాప్తాడు: విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని చదవాలని శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎస్‌వీఐటీ) ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ అన్నారు. శనివారం మండలంలోని హంపాపురం సమీపంలోని వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌వీఐటీ) ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా దేశంలోని 15 ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు హాజరై డిగ్రీ, ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ, కళాశాల ప్రిన్సిపాల్ టి.సూర్యశేఖర్ రెడ్డి, ఎస్‌వీఐటీ కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎండీ వెన్నపూస రమాకాంత్ రెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వర్షపునీరు



వర్షానికి తడవకుండా ధాన్యాన్ని కప్పిన రైతులు

• అనంతలో వర్షం

జిల్లాలో మూడు,నాలుగు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. మేఘాలు కమ్ముకొని, చల్లని గాలులు వీస్తున్నాయి. వర్షం కురుస్తుందా..అన్నట్లు అనిపించినా.. చల్లని ఈదురుగాలులతో సరిపెట్టేది. సాధారణంగా డిసెంబర్ నెలలో చలి అధికంగా ఉంటుంది.. చలికాలంగా చెప్పుకునే సమయంలో తుపాను ప్రభావంతో చిరుజల్లులు పడ్డాయి. శనివారం ఉదయం నుంచి నగరంలో అక్కడక్కడ చిరుజల్లులతో ప్రారంభమై మోస్తరు వర్షం కురిసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



నగరంలో కురుస్తున్న చిరుజల్లులు

అనాథ పిల్లలను అక్కున చేర్చుకున్న 'అమ్మ'

అనంతపురం కల్చరల్: 'అమ్మ' సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి.. మరో ఇద్దరు అనాథ పిల్లలను అక్కున చేర్చుకున్నారు. వివరాలు.. నల్లమాడకు చెందిన సాయి హారిక, సాయి చైతన్యలకు చిన్నతనంలోనే తల్లి మరణించింది. కొన్నేళ్ల తర్వాత తండ్రి గోవింద్ కూడా వెన్నెముక వ్యాధితో మంచానికి పరిమితం కావడంతో చదువుకు దూరమయ్యారు. పూట గడవడమే కష్టమైపోయింది. ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తుండగా.. 'అమ్మ' సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి వారిని చేరదీసి అక్కున చేర్చుకున్నారు. శనివారం వారింటికెళ్లి దత్తత తీసుకొని పిల్లల బాగోగులు కూడా చూసుకుంటానని భరోసా కల్పించారు. రూ.30 వేలు నగదు, రూ.25 వేలు విలువజేసే దుస్తులు, మరో రూ.30 వేలు విలువజేసే నిత్యావసర వస్తువులు కూడా అందించారు. భవిష్యత్తులో కూడా చిన్నారుల చదువు, తండ్రి వైద్యానికి కూడా సాయం అందిస్తానని తెలిపారు. బాధితుడు గోవిందు మాట్లాడుతూ అమ్మ సంస్థ రమణారెడ్డి చేసిన సాయంతో మా కుటుంబానికి ఎంతో ఊరట కలిగించిందని కృతజ్ఞతలు తెలిపాడు.



అనాథలుగా మారిన చిన్నారులకు అండగా నిలిచిన అమ్మ రమణారెడ్డి

మైనార్టీల సంక్షేమానికి వైఎస్ జగన్ కృషి

అనంతపురం అర్బన్: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి సంఘం తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్‌మేవా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్షావలి, ఫరూక్ అహమ్మద్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమీపంలో ట్రెజరీ ఉద్యోగులు సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఆల్‌మేవా సమావేశంలో వారు మాట్లాడారు.



మాట్లాడుతున్న ఆల్‌మేవా జిల్లా ప్రధాన కార్యదర్శి అహమ్మద్

రాష్ట్ర కమిటీ ఎన్నికలకు సిద్ధం కావాలి..

ఆల్‌మేవా రాష్ట్ర కమిటీ ఎన్నికలకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పని చేస్తున్న ముస్లిం, క్రిస్టియన్ ఉద్యోగులు సిద్ధం కావాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్షావలి, ఫరూక్ అహమ్మద్ తెలిపారు. ఈనెల 25న కర్నూలు సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలు జరగనున్నాయన్నారు. నంద్యాలలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.12 కోట్లతో నూతన ఉర్దూ జూనియర్ కళాశాల, మైనార్టీ వసతి గృహం, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, సద్భావన బిల్డింగ్ ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ విద్యార్థినీ విద్యార్థులకు నూఏతన భవనాల నిరాణానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ధన్యావాదాలు తెలియజేసుకుంటున్నామన్నారు. అనంతరం ముస్లిం మైనార్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.

సమస్యలు పరిష్కరించాలి..

మైనార్టీల సంక్షేమం కోసం నిర్దేశించిన ప్రధాన మంత్రి 15 సూత్రాల మైనార్టీ పథకాన్ని జిల్లాలో అమలు చేయాలన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగంలో 15 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఆక్రమణలకు గురైన వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వం పరరక్షించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో మైనారిటీలకు దామాషా ప్రకారం వాటా కేటాయింపులు చేయాలన్నారు. మైనారిటీ విద్యావంతులకు పోటీ పరీక్షల్లో తర్ఫీదు ఇచ్చేందుకు ప్రతి జిల్లాలో మైనార్టీ స్టడీ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. కర్నూలు లోని అబ్దుల్ హక్ విశ్వవిద్యాలయంలోని ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను మంజూరు చేయాలన్నారు. సమస్యల ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ తీర్మానం చేశారు. సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షులు ఫకృద్దీన్, జిల్లా కోశాధికారి దౌలా, ఉపాధ్యక్షుడు జిలాన్, నాయకులు అశ్రఫ్‌అలీ, ఏఎంబాషా, అన్వర్, అబ్దుల్‌రసూల్, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ నాయకులు అవినీతిపరులు'

అనంతపురం టవర్‌క్లాక్: కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడి రూ.కోట్లు ఆస్తుల రూపంలో కూడబెట్టుకున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక టవర్ క్లాక్ వద్ద నుంచి నగరంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అవినీతిని ఖండిస్తూ ర్యాలీ చేశారు. ర్యాలీకి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్ కనంపల్లి చిరంజీవిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఈనెల 6న ఆదాయ పన్ను శాఖ అధికారులు దాడి చేసి, ఇప్పటివరకు దాదాపు రూ. 250 కోట్లకు పైగా స్వాధీనం చేసుకున్నారన్నారు. కాంగ్రెస్ ఎంపీ దగ్గరే ఇంత అవినీతి డబ్బు ఉందంటే దేశంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు అవినీతికి పాల్పడి అక్రమ ఆస్తులు ఎన్ని కూడగట్టుకునిఉంటారో అర్థం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రత్నమయ్య, దేవిరెడ్డి లక్ష్మిదేవి, లలిత్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు అశోక్ రెడ్డి, శ్రీధర్ చౌదరి, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మేఘనాథ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌నగర్ బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని అశోక్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శనివారం పరిశీలించారు. అశోక్‌నగర్ మొదటి క్రాస్‌కు వెళ్లేందుకు దారి సరిగా లేకపోవడంతో అధికారులతో మాట్లాడారు. ఇక్కడ వాహన రాకపోకలు సాగేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. మార్గం సుగుమం చేసేందుకు అలైన్‌మెంట్ చేయాలన్నారు. అదే విధంగా బ్రిడ్జి పక్కన ఉన్న కాలువను పరిశీలించి మురుగునీరు సాఫీగా ముందుకు సాగేలా చూడాలన్నారు. పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, పబ్లిక్ హెల్త్ ఈఈ సతీష్, డీఈ సుభాష్ చంద్రబోస్, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రవి, జావిద్, తదితరులు పాల్గొన్నారు.



అశోక్‌నగర్‌లో బ్రిడ్జిని పరిశీలించి సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని కృష్ణ కళా మందిర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. నగర మేయర్ వసీం, కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమం ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు పేదల దరికి చేరాలన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయం, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల ముంగిటలకే పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రాముఖ్యతను విపులంగా తెలియజేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, ఫసల్ బీమా యోజన, పోషన్ అభియాన్, ఉజ్వల్ యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం గరీబ్ కళ్యాణ్, పీఎం విశ్వకర్మ (సూక్ష్మ,చిన్న మధ్య తరహా పరిశ్రమలు), పీఎం ముద్రాలోన్, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, స్వచ్ఛభారత్ అభియాన్, పీఎం ఈ బస్, పునరుజ్జీవం, పట్టణ పరివర్తన కోసం అటల్ మిషన్, పీఎం భారతీయ జన ఔషధి పరియోజన, ఫార్మాసూటికల్స్, ఖేలో ఇండియా, ఆర్‌సీఎస్ ఉడాన్, వందే భారత్ రైళ్లు తదితర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారు లబ్ధిపొందేలా విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. శనివారం నుంచి 22 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నగర పరిధిలో నిర్వహించేలా ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సివిల్ సప్లై అధికారులు లబ్ధిదారులకు గ్యాస్ స్టవ్‌లు పంపిణీ చేశారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్పయాత్ర వాహనాన్ని మేయర్ వసీం జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణ కళామందిర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్ కోగటం, మున్సిపల్ కమిషనర్ తదితరులు

నేడు తుమ్మల మారెమ్మ ఆలయ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని గుత్తిరోడ్డులో వెలసిన తుమ్మల మారెమ్మ ఆలయ 12వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరగనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పి.లక్ష్మన్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, అభిషేకాలు జరుగుతాయన్నారు. అనంతరం తీర్థప్రసాదాలతో పాటు అమ్మవారి శేష వస్త్రాలను భక్తులకు అందిస్తామన్నారు.

అధ్యాపకులూ నిత్య విద్యార్థులే

అనంతపురం: అధ్యాపకులూ నిత్య విద్యార్థులే అని జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్ అన్నారు. జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ కళా శాలలో గత ఆరు రోజులుగా 'ఎక్స్‌ప్లోరింగ్ ద కటింగ్ ఎడ్జ్ వరల్డ్ ఆఫ్ చిప్ డిజైన్ ' అనే అంశంపై అధ్యాపకులకు శిక్షణ కల్పించారు. ముగింపు సందర్భంగా శనివారం కార్యక్రమానికి రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇలాంటి సదస్సులతో అధ్యాపకుల్లో ఉండే సందేహాలను నివృత్తి చేయడానికి వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మమత, అర్జున్ హరినాగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్

నేడు శ్రీనివాస కల్యాణ మహోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని ఆర్ఎఫ్‌రోడ్డు శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోవింద మాల బృందం ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణోత్సవం, సాయంత్రం పుర వీధుల్లో గ్రామోత్సవం ఉంటాయని, భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకోవాలని కోరారు.

ముగిసిన అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలు



సత్తా చాటిన క్రీడాకారులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని క్రీడా మైదానంలో నిర్వహించిన ఎస్కేయూ అంతర కళాశాల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ – 2023–24 పోటీలు శనివారం ముగిశాయి. స్త్రీల విభాగంలో ఛాంపియన్‌షిప్‌ను బి. మేఘన (ఎస్‌డీజీఎస్ డిగ్రీ కళాశాల, హిందూపురం) సాధించగా, పురుషుల విభాగంలో జి.చంద్రశేఖర్ (నారాయణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, తాడిపత్రి) మొదటి స్థానం దక్కింది. ఈ సందర్భంగా సత్తా చాటిన క్రీడాకారులను ఎస్కేయూ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ ఎంపీ .శ్రీనివాసన్ అభినందించారు.

సున్నీ ఇస్తెమాకు భారీ ఏర్పాట్లు

అనంతపురం కల్చరల్: నగరంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు జరిగే సున్నీ ఇస్తెమా నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. తెహరిక్ ఫైజానే ఉమర్ ఫారుక్ ఆధ్వర్యంలో 14వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక జూనియర్ కాలేజ్ మైదానంలో జరిగే సామూహిక ప్రార్థనలు, దివ్య సందేశాలు ఇవ్వడానికి ఇతర రాష్ట్రాల నుంచి మత పెద్దలు ఇప్పటికే అనంతకు చేరుకున్నట్లు నిర్వాహకులు తెహరిక్ అధ్యక్షుడు హజరత్ హసన్ రజాఖాద్రీ తెలిపారు.

కాలువలపై ఆక్రమణలు సరికాదు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో కాలువలపై ఆక్రమణలను ఉపేక్షించొద్దని అధికారులను మేయర్ వసీం ఆదేశించారు. శనివారం 39వ డివిజన్‌లో రవి పెట్రోల్ బంక్ సమీపంలో కాలువలపై ఉన్న ఆక్రమణలతో వర్షపు నీరు బ్లాక్ అయ్యింది. దీంతో మేయర్ ఆదేశాలతో కాలువపై ఉన్న కల్వర్టు, కట్టడాలను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈఈ సూర్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు పాల్గొన్నారు.




ఒరె..ఒరె.. కొంచెం ఆగరా..



• వానరమా.. వయ్యారమా!

శీతాకాలం..చల్లని గాలి వీస్తుంటే... మరోవైపు చిరుజల్లులు పడుతూ ఉంటే.. ఇంకేముంది వానరాలకు చెప్పలేని హాయినిచ్చినట్లుంది. చుట్టూ పచ్చని పొలాలు.. మధ్యన జాతీయ రహదారి.. ఆ పక్కనే ఉన్న వంతెనపైకెక్కిన వానరాల వయ్యారాలు.. 'వావ్..నరం' అనిపించేలా ముచ్చటగొలుపుతున్నాయి. ఎదురుగా ఎత్తయిన హనుమాన్ విగ్రహం కూడా ఉండడంతో మరింత వింతలా కనిపించింది. గుత్తి – అనంతపురం జాతీయ రహదారి సమీపంలో తడకలేరు బ్రిడ్జి వద్ద వనరాల సమూహం వరుసగా.. వింత చేష్టలు చేస్తూ అటుగా వెళ్లే వారిని కనువిందు చేసిన దృశ్యం 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



జై.. హనుమా!



చిరుగాలి ..వానరాలసమాలోచన



హ్వా..హ్వా..హ్వా.. వదలరా